# గుణకారం

రాధ ద్వారంలో నిల్చుంది.

అది ఆ ఫ్గారు హైస్కూలుకు వెళ్ళే రస్తా...

ఆ రస్తా ప్రక్కనే రాధ యిల్లు...

...కానీ రాధ స్కూలుకు వెళ్ళదు!...

స్కూలుకు వెళ్ళే అమ్మాయిల్ని, అబ్బాయిల్ని చూస్తూ వుంటుంది. రోజూ ఉదయమూ, సాయంకాలమూ అలా వచ్చిపోయే అబ్బాయిల్ని, అమాయిల్ని చూస్తూ నిల్చుంటుంది. చూసి ఒకోసారి కళ్ళనీళ్ళు విడుస్తుంది. ఒకసారి ఆనందం పొందుతుంది. ఒకసారి అసూయ కలుగుతుంది. ఒకసారి ద్వేషం కలుగుతుంది. ఒకసారి ఉసూరుమని నిట్టూర్పు విడుస్తుంది. ఇలా రోజులు గడిపి వేస్తున్నది రాధ!

రాధ థరుడుఫారంవరకు హైస్కూల్లో చదివింది. 'తల్లిదండ్రుల'నే పేరిట పిల్లల బాధ్యతను స్వీకరించి, ఆధిపత్యం చెలాయించేవాళ్ళు ఆపేశారు. సెకండుఫారంలో వుండగానే ఆపేస్తామన్నారసలు! అప్పుడు పెద్దన్నయ్య పట్టుపట్టి ఇంట్లో పోట్లాడి ఒప్పించి పంపించాడు. ఈసారికూడా అతను చెల్లెల్ని చదివించి తీరాలని పట్టుపట్టాడు గానీ బాధ్యత తెలీకుండా, ఇష్టమొచ్చినట్లు పేలేవంటే, నిన్నూ చదువు మానిపించేసి, మడకొట్టయ్యదగ్గర పడేస్తా'నని తండ్రి బెదిరించేసరికి గొణు

క్కుంటూ ఊరుకున్నాడు. ఒక నిట్టూర్పు విడిచి ఊరుకున్నాడు.

ఒకమ్మాయి స్కూలుకు టైమయిందని వగరుస్తూ పరిగెడుతోంది:

"ఏయ్ సీతా- ఆగు. నేనూ వస్తున్నా" అని తనకు వందాపదై గజాల దూరంలో వున్న మరో అమ్మాయిని కేక వేస్తూ పరుగెత్తింది. ఆ పరుగులో ఆ అమ్మాయి జడ అటూ ఇటూ వూగులాడుతూ రాధ మనస్సును వూగిసలాడించింది. ఆ అమ్మాయి మంచి లేతాకుపచ్చ పరికిణీ కట్టింది. గులాబి రంగు వల్లెవాటు వేసింది. చక్కని పసుపూ ఎరుపూ కలిసిన రంగు జాకెట్ తొడిగింది. తల నున్నగా దువ్వి, పొడుగాటి జడమీదుగా తలమీద మల్లెపూలమాల పెట్టింది. ముఖాన చిన్న ఎర్రని చుక్క పెట్టింది. పిల్ల ఎంత వొగురుస్తున్నా, చక్కగా చందనపు బొమ్మలావుంది. చలకీగా వుంది. ఆ లేత ఎండలో తళతళ లాడిపోతూ పరుగెడుతూ ఉంటే రాధ హృదయం అల్లాడి పోయింది. రాధ అనుకుంది.

'తనూ యింతే! రోజూ ఆలస్యంగానే వెళ్ళాల్సి వచ్చేది. ఇంట్లో పనంతా పూర్తి చేసుకొని, బట్టలు వేసుకొని బయలుదేరేసరికి ఎప్పుడో టైమయిపోయి వుంటుంది. అప్పుడు తనూ ఇలాగే వొగురుస్తూ పరిగెత్తేది! ఇలాగే ఏ సీతనో, కౌసల్యనో కేకవేసి పరిగెత్తేది! వాళ్ళేవరూ ఆగకపోతే, తర్వాత క్లాసుకు వెళ్ళినప్పుడు ప్రక్కన కూర్చుని జడపట్టి లాగి ముందొచ్చి ఏం బావుకున్నావని గిల్లి ఏడిపించేది.

వాళ్లూ ఓ చిలిపి పనిచేసి, తర్వాత ఎప్పుడో మేష్టారు ఉరిమి చూసినప్పుడు అందరూ వూరుకొనేవారు.

రోజూ సాయంకాలం స్కూల్ ప్లే గ్రౌండ్‌లో ఆడుకోవడం ఎంత హాయిగా వుండేది. కానీ...అప్పుడూ అంతే, తనే అందరికన్న ముందు బయలుదేరి ఇంటికి చేరుకోవలసి వచ్చేది. ఇంట్లో బోలెడు పనీ తనే చేసుకోవాలి. అమ్మ ఎప్పుడూ 'తలనొప్పి' 'తలనొప్పి' అని మూలుగుతూ పడుకొంటుంది. నిజానికి అంత మీదికొస్తేగాని ఆమె పడుకునేది కాదు. అంత బాధా భరిస్తూనే పనిచేస్తూ వుంటుంది. అలాంటి అమ్మకు సాయపడకుండా ఎలా వూరుకోవడం? తను ఎంత చేసినా, అంతా తనే చేస్తానని, ఆమెను వారించినా, నిజానికి ఆమెకూ విశ్రాంతి దొరకదు. తనకూ తీరిక వుండదు. ఆ పొయ్యి ఊది వూదీ ఆమె ప్రాణంపోతూ వుంటుంది. తలనొప్పి రమ్మంటే ఎందుకు రాకుండా వుంటుంది! వద్దన్నా వస్తుంది! పిల్లలతో నడవటంఒక పెద్ద తలనొప్పి పని. ఒక్కరూ చెప్పినమాట వినరు. స్నానం చేయమంటే వీధిలోకి వెళ్ళి మట్టి పులుముకొంటారు. అన్నం తినమంటే గదిలోకివెళ్ళి బెల్లం తింటారు. ఎంత ఓపికుంటే మాత్రం ఏం చేస్తుంది అమ్మ? ఎలా వేగుతుంది? వీళ్ళంతా ఒకయెత్తు. అవ్వగారే ఒకఎత్తు. తనయితే ఆవిణ్ణి కాపురానికి వచ్చిన మొదటివారంలోనే పీక నులిమి చంపిపారేసేది. ఏమీ పాపంరాదు. కుటుంబాన్ని పుణ్యంచేసి ఉద్ధరించినట్లవుతుంది! ఇంట్లో ఈ అశాంతి వుండదు. తనకూ ఒక కోడల్ని భగవంతు డిచ్చాడని, పాతిక ఏళ్ళుగా అమ్మని పీడించుకు తింటోంది. ఆవిడకు

ఇన్నేళ్ళొచ్చాయి. ఇప్పటికి ఒక కూరచేయడం రాదు. పులుసు చేయడం రాదు. ఒక్కపని చేతకాదు. కానీ చేసిపెట్టే వాళ్ళని దబాయించి నానాతిట్లు తిట్టి సాధిస్తూ కాలక్షేపం చేస్తోంది! ఏం పని! ఇంట్లో పిల్లల్నీ, పెద్దల్నీ తిట్టిన తిట్టు తిట్టకుండా తిడ్తూ వుంటుంది. ఆ తిట్లన్నీ మళ్లీ జ్ఞాపకం చేసుకోవడం కూడా మహాపాపంగా వుంటుంది. ఆ తిట్లలో సామెతలూ, నుడికారాలు, శాపనార్థాలు, దివసాలు, అతి చెడ్డ భాషాలో దొర్లి పోతూ వుంటాయి. ఎదుటివారి మనసును కష్టపెట్టడానికి ఏయే పదాలు వాడాలో ఆవిడకు బాగా తెలుసు.

అమ్మాయితే అసలు పట్టించుకోదు గానీ, అందరూ అలా వుండగలరా! అలా వినీ విననట్లు తనని కాదన్నట్లు వూరుకొని ఆవిడ అడుగులకు మడుగులొత్తుతూ జబ్బుతో మూలపడి ఇంకా పెత్తనం చలాయిస్తూ తిడ్తున్న ఆవిడకు సేవ చేస్తూ, పైగా ఆ తిట్లకు చీదరింపులకు చలించకుండా వూరుకోవడంతన చేత కావడంలేదు ఒక్కోసారి విలవిల లాడిపోతుంది. ఎక్కడికైనా పారిపోవా లనిపిస్తుంది. ఎక్కడికి పోవడం? తను లేకపోతే, అమ్మ వారం రోజుల్లో చచ్చిపోతుంది. ఈ 'మనుష్యు' లనేవాళ్ళు ఆమెని చంపేస్తారు. ఒక పనిమనిషిని చూడమంటే, నాన్న పట్టించుకోవడం లేదు. ఆయనకు ప్రతి రోజూ, ప్రతిక్షణమూ పొలం విషయాలే! ఈ మధ్య సేద్యం సరిగ్గా జరక్క, పంట చేతికిరాక, ఆయన వ్యాకుల పడిపోతున్నారు. ఆయనసలు అన్నమే సరిగా తినడంలేదు. ఇంటి విషయాలేమీ పట్టించుకోవడం లేదు. అమ్మ ఇన్నేళ్ళుగా

తలనొప్పితో బాధపడుతూవుంటే, ఏమీ చేయలేక వూరుకున్నారు. అమ్మకూడా అలాంటిదే. నోరెత్తి అడగదు. చెప్పదు. వూళ్ళో షాపులనుంచే అణా కానీ మాత్రలు తెప్పించుకొని తింటూ వుంటుంది. నుదుటికి తైలం రాసుకుంటుంది. వేడి వేడి నీళ్ళు త్రాగుతుంది. కషాయం త్రాగుతుంది ఇంకా ఏమైనా చేస్తుంది గానీ, డబ్బు ఖర్చయ్యే హాస్పిటలుకు గానీ, డాక్టరు దగ్గరకు గానీ, చిత్తూరో, ఏలూరో వెళ్ళాలని మటుకు అనుకోదు.

చివరికి యింక ఇలా వూరుకుంటే, ఇంట్లో మంచి నీళ్ళిచ్చే గతయినా వుండదని మొన్ననే నెల్లూరు హాస్పిటల్‌కి తీసుకెళ్ళేరు. వాళ్ళు కళ్ళలో మందులూ అవీ వేసి, కళ్ళద్దాలు వేసుకోవా లన్నారు. అమ్మ చస్తే వేసుకోనని, వారం రోజులు పట్టుబట్టి, తర్వాత తాతయ్య వెళ్ళి చెప్తే వేసుకుంది. ఇప్పుడు ఇంటికొచ్చి వాటిని శుభ్రంగా ఒకచోట వుంచేసింది. వేసుకోవడం లేదు. తలనొప్పి ఇంకా ముందంత ఉధృతంగా కాకపోయినా, తరుచూ వస్తూనే వుంది.

పొలంపనులు ఎక్కువై, ఇంట్లో పనులు కూడా ఎక్కువయ్యాయి. రోజూ కూలీలు వస్తున్నారు. వాళ్ళందరికీ రోజూ వంటలుచేయాలి. ముసలావిడ ఇంకా పైకి లేవనూలేదు. చచ్చిపోనూ లేదు. ఆవిడకు చాకిరీ చేయడానికే ఇద్దరు మనుష్యులు సరిపోతారు.

పాలు త్రాగాలంటుంది. తీసుకెళ్ళి యిస్తే, వేడిగా వుందనో, చక్కెర చాలదనో, చల్లగా వుందనో, గ్లాసు తన

మీాదే పడేస్తుంది. ఒలకబోసేసి శపిస్తూ, అడ్డమైనతిట్లూ తిట్తుంది. ఇవన్నీ భరించడం తన చేతకావడం లేదు.

తన వయస్సులో పిల్లలందరూ హాయిగా స్కూలుకు వెళ్తూ, ఆడుకొంటూ. పాడుకొంటూ, ఏ బాధ్యతా, చీకూ చింతా లేకుండా సిసలయిన పిల్లల్లాగా జల్సాగా గడిపేస్తున్నారు. అందరూ అలావుంటే తనొక్కతే ఇలా ఎందుకు నలిగిపోవాల్సి వస్తుందో రాధ కర్థంకాలేదు. ఇంట్లో పనులు చేయడానికి తనను బడి మాన్పించేశారు.

అన్నయ్య పెళ్ళి చేసుకుంటే, అమ్మకుకొంత సహాయంగా వుండేది. కానీ...అన్నయ్యపెళ్ళి చేసుకోనంటాడు. తనింకా ఏవేవో గొప్ప పనులు చేయాలట. ఏదేదో చదవాలట. అప్పుడు తన కిష్టమైన అమ్మాయిని చూసుకు తనే పెళ్ళి చేసుకుంటాడట! అన్నయ్య అనంతపనీ చేసేవాడే!

తనను బడి మాన్పించటానికి గల ముఖ్యకారణాల్లో తమ్ముణ్ణి ఎత్తుకోవడం, వాడి సంరక్షణ చూసుకోవడంకూడా ఒకటి! తమ్ముణ్ణి చంక నెత్తుకుని తిప్పాలి. క్రింద ఒక్కక్షణం వుండలేడు. క్రిందికి దించితే తన పుట్టి మునిగిపోయినట్లు ఘొల్లున ఏడుస్తాడు. తమ్ముణ్ణి చూసుకుంటూనే అన్ని పనులూ చేయాలి.

"ఏమే! ఎక్కడ చచ్చావే" అని ముసలమ్మ అరిచింది.

తమ్ముడు బిగ్గరగా 'అక్కా' అని ఏడుస్తున్నాడు.

"ఆకలి. అన్నంపెట్టు నాకు" అని 'రవి' కేకలేస్తున్నాడు.

"రాధా" అని అమ్మ పిలిచింది.

"అమ్మా నేను గొడ్లు విడవాలింక. నాకు అన్నం కట్టిచ్చేయండి. నేను పోతాను" అని పశువులు మేపే వెంకడు అన్నాడు దగ్గరకొచ్చి.

రెండు నిమిషాలు కళవళపడి, రస్తా ఇటూ అటూ చూసి లోపలికి నడిచింది రాధ.

◆ ◆ ◆

రోజులు, మాసాలు గడిచాయి. రాధ జీవితంలో ఎలాంటి మార్పూ లేదు. రాను రాను శ్రమ ఎక్కువైంది. ముసలావిడ ఎప్పుడో చనిపోతుందనుకుంటే ఇంకా అందర్నీ ఏడిపిస్తూనేవుంది. రాధ అన్నయ్య పెళ్ళి చేసుకోలేదు. అమ్మ ఆరోగ్యవంతురాలు కాలేదు. ఎంతో బలహీనంగా వుంది.

"ఇప్పుడు ఇంట్లో అందరూ తననే వేపుకు తింటు న్నారు. అందరికీ అన్ని సౌకర్యాలూ తనే అమర్చిపెట్టాలి. పిల్లలకు స్నానాలు అవి చేయించి, చల్దన్నం తిననిచ్చి బడికి పంపాలి. కూలిలకు, పాలేరుకు పొలంపనులకువెళ్ళే నాన్నకు, చిన్నన్నయ్యకు అన్నంపెట్టి పంపించాలి. తర్వాత హైస్కూ లుకు వెళ్ళే రమణన్నయ్యకూ, తమ్ముడికి వేడన్నం పెట్టి పంపించాలి. చిన్న తమ్ముణ్ణి ఎత్తుకోవాలి. ముసలావిడకు సేవ చేయాలి.

అమ్మ వంటదగ్గర వచ్చి కూర్చుంటుంది. ఆ పొగకు తట్టుకోలేకే ఆమెకు దగ్గు వస్తోంది. అయినా తన కష్టం చూడలేక పనిచేస్తూ వుంది. ఇంట్లో ఎప్పుడూ ఎండు కట్టెలు

వుండవు. ఇంతమంది వున్నారు. ఎందుకూ! ఇంత సేద్యం చేస్తారు. ఏం లాభం! ఒక రోజు తీరుబడి చేసుకొని వంటకలప తెచ్చి పడేయ్యరు. ఒకరోజు వాళ్ళు శ్రమ తీసుకుంటే ఇంట్లో ఆడవాళ్ళు నాలుగు మాసాలు ఇలా పొయ్యి వూది వూది చచ్చే అవసరం తప్పుతుంది. అయినా ఈ మగవాళ్ళకు ఇవన్నీ ఏమీ పట్టవు! అర్థంకావు. ఎన్ని రాజకీయ కార్యాలైనా చక్కబెట్టేస్తారు గానీ ఇంట్లో ఆడవాళ్ళ సౌకర్యం ఒక్కటీ చూడలేరు! భోజనం అప్పుడుమటుకు అన్నీ ముందుకు రావాలి! మాంచి రుచిగా, శుచిగా కూరలూ అవీ తయారు కావాలి. లేదా ధాం అని ఎగిరిపడ్తారు! హూ.

బడికివెళ్లే వాళ్ళందర్నీ పంపించేశాంగదా అనుకొంటే, మరో గంటలో చిన్నపిల్లలు బడినుంచి వచ్చేస్తారు. వాళ్ళు 'ఆక లాకలని' బడిలోనే ప్రారంభించి ఇక్కడికి వచ్చి కూతలు పెట్టేస్తారు. అన్నం కాకపోయినాసరే వచ్చి కూర్చుంటారు. పోనీ పళ్ళైనా తీసి ముందు పెట్టుకొని కూర్చోరు. మగపిల్లలైతే పోనీ అనుకోవచ్చు. ఆడపిల్ల, అదీ ఒకప్పుడు నాలాగే కష్టపడాల్సిందేమో కదా, ఆ లలితైనా వాళ్ళ గిన్నెలు, గ్లాసులూ తెచ్చిపెట్టి కూర్చోరాదూ? తన గిన్నైనా తెచ్చుగోందే! అబ్బ! సీతమ్మ తల్లీ!

సరే...వీళ్ళందరికీ ఎలాగో అన్నంపెట్టి, సర్దేసి పంపేస్తే ఒకటే అల్లరి. వీళ్ళకు నా 'వంటబడి' లాగా రోజుకు ఓ ఇరవయ్యో, ఇరవై నాలుగ్గంటలలో బడి ఒకటి వుంటే అయినా బావుండును. ఈ అల్లరిని సహిస్తూ అప్పుడే పొలం దగ్గరికి అన్నం పెట్టి పంపించాలి. ఒక్కోరోజు తనే అన్నం

తట్ట పొలందగ్గరికి తీసుకెళ్ళాలి. మంచి ఎండలో ఆరు ఘర్లాం గుల దూరం వెళ్ళొచ్చేసరికి తలనొప్పి దంచేస్తుంది. ఎక్క డైనా 'చన్నీళ్ళ బావి'లోకి గెంతుదా మనిపిస్తుందప్పుడు. ముసలావిడ ప్రశాంతంగా వుండవలసిన ఇంట్లో రణగొణ ధ్వనులు, పెళపెళ్ళాడటంతో తన 'తిట్లబాణాలు' వరసగా వదుల్తూ వుంటుంది. అలాంటప్పుడు ఈ ఇంట్లో మనుష్యులు ఎలా వుండగలుగుతారు. తనకు పొద్దస్తమానూ మండు టెండలో సుడిగాలిలో తగులుకొని విలవిలలాడి పోతూ వున్నట్లుంది.

♦ ♦ ♦

"రాధకింక పెళ్ళిచేసేయడమే మంచిదిగా కనిపిస్తోంది. ఇప్పటికే మూడుసంబంధా లొచ్చాయి. మన రాధకు బాగా పనీపాట లొచ్చనీ అందరికీ తమ అబ్బాయిలకు చేసుకోవా లనిపించేలా వుంది. రాధ ఎవరింటికీ వెళ్ళినా వాళ్ళిళ్ళూ, వాకిళ్ళూ కళకళ లాడుతాయి. సుబ్బయ్య నాలుగో కొడుక్కు అడుగుతున్నారు. సుబ్బయ్యకు నలుగురు ఆడపిల్లలు కూడా వున్నారు. మగవాళ్ళ కెవరికైనా చేసుకోవచ్చు. ఈ సంబంధం వల్ల చాలా లాభాలున్నాయి. ఏమంటావు?" అది నాన్న కంఠం నుంచి వెలవడుతున్న మాటలు.

"మీా యిష్టం. జాగ్రత్తగా...నిదానంగా ఆలోచిం చండి. చిన్నపిల్లేగా! మనం తొందరపడటం దేనికి?" అంది అమ్మ.

"సుబ్బయ్య భార్య. సుబ్బయ్య, సుబ్బయ్య అక్క, సుబ్బయ్య తల్లి, సుబ్బయ్య కొడుకు, కూతుళ్ళు. కోడళ్ళు,

మనుమలు, పనివాళ్ళు...ఒక్కసారి ఆమె కళ్ళముందు కీసర బాసరమని అరుస్తూ ఏదో 'తిరునాళ్ళ'లో లాగా గజిబిజి మేళ తాళాల మధ్య నాట్యంచేశారు, ఆమె కళ్ళముందు. పుట్టినింటి కంటె మెట్టినింటిలో రెండు రెట్లు చాకిరి ఎదురుచూస్తున్న దన్నమాట. పుట్టింటి జీవితాన్ని రెండుతో హెచ్చిస్తే అత్త వారింటి జీవితం కాబోలు! ఆలోచిస్తూ పడుకొన్నది రాధ!

—.•.—